తిరుమల అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల కొండల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం శిలాతోరణం, శ్రీవారిపాదాల దగ్గర మంటలు చెలరేగాయి. శ్రీవారి పాదాలకు వెళ్లే దారిలో ఉన్న అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే ఫైరింజన్ల సాయంతో అక్కడకు చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో మంటలను నియంత్రించారు. అయితే మంటలు చెలరేగడానికి గల కారణాలు ఏంటనేదీ తెలియాల్సి ఉంది. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

కేసు నమోదు చేయడంలో పోలీసుల అలసత్వం

వేణుగోపాల్ కాలనీ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వేణుగోపాల్ కాలనీలో ఇళ్లను కూల్చివేసిన వారిపై కేసు నమోదు చేయకుండా అలసత్వం వహిస్తున్న పోలీసుల వైఖరి నశించాలని నిర్వాసితులు మంగళవారం ఎంఆర్‌ఒ, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుల వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ తిరుపతికి కూతవేటు దూరంలో తిరుమల నగర పంచాయతీ పరిధిలోని వేణుగోపాల కాలనీ ఇళ్లను గతనెల 26వ తేదీ జేసీబీలతో కూల్చివేస్తే ఇంతవరకూ పోలీసులు ఎందుకు కేసు నమోదు చేసి అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. కూల్చివేసిన వారిని గుర్తించడంలోనూ, జేసీబీలను, ట్రాక్టర్లను సీజ్ చేయడంలోపోలీసులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. గతనెల 27, 28 తేదీల్లో రెండుసార్లు నిర్వాసితులు ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే కేసులు నమోదు చేయాలని, ఎంత నష్టం జరిగిందో రెవెన్యూ అధికారులు అంచనా వేసి

ధర్నాలో ప్రసంగిస్తున్న వందవాసి నాగరాజు

రిపోర్టు పంపించాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 20 రోజులు కావస్తున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు తప్ప, సమస్య పరిష్కరించాలనే రీతిలో వ్యవహరించడం లేదన్నారు. 300 మంది రౌడీలు కూల్చివేతకు పాల్పడితే ఇంతవరకు సిసి ఫుటేజీ ఆధారాలను సైతం పోలీసులు గుర్తించలేదన్నారు. ఇంత పెద్ద ఘటన జరిగితేనే స్పందించని పోలీసులు, ఇంకా నగర ప్రజలకు ఏమాత్రం భద్రత కల్పిస్తారని, ప్రశాంతత నెలకొల్పుతారన్నారు. నిరసన అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తహశీల్దార్ స్పందిస్తూ రిపోర్టును రాసి పంపుతానని, చట్టప్రకారం పరిష్కరించుకోవాలే తప్ప, ఈ రకంగా దాడులు చేయడం సరైన విధానం కాదన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి ఆర్డీవోతో మాట్లాడారు. ఆర్డీవో స్పందిస్తూ ఇరువర్గాలకు నోటీసులు పంపి, ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని, ఎవరైతే దాడికి పాల్పడి ఇళ్లు కూల్చివేశారో, వారిపై కఠిన చర్యలు తీసుకోడానికి ఎఒ ద్వారా పోలీసులకు రిపోర్టు రాసి పంపిస్తానని హామీ ఇచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిపిఐ నాయకులు బండి చలపతి, కెవై రాజ ఆందోళనకు మద్దతిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం మాధవ్, బుజ్జి, మల్లికార్జునరావు, వెంకటేష్, శ్రీరాములు, రిషి రెడ్డి, శివమణి, హరి, సురేష్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఐసెర్'లో అగ్ని కీలలు

కెమిస్ట్రీ ల్యాబ్‌లో ఎగిసిపడిన మంటలు
అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి (ఐసెర్)లో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఐసెర్ నాల్గవ అంతస్థులో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్ లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటల ధాటికి పెద్దపెద్ద శబ్దాలు ఏర్పడి అగ్నికీలలు, పొగ బయటకు రావడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కి పడ్డారు. వెంటనే తేరుకున్న ఐసెర్ యాజమాన్యం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. శ్రీకాళహస్తి, వెంకటగిరికి చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తేవడంలో విజయవంతమయ్యారు. ఐసెర్‌లో తరగతులు జరుగుతుండగానే అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓ శిక్షకుడికి స్వల్ప గాయాలైనట్లుగా చెబుతున్నారు. విద్యార్థులకు ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అప్రమత్తంగా ఉన్న విద్యార్థులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఐసెర్‌లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. నాల్గవ అంతస్థులోని కెమిస్ట్రీ ల్యాబ్ లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై ఐసెర్ యాజమాన్యం మీడియా ప్రకటనను విడుదల చేసింది. జరిగిన అగ్నిప్రమాదం చాలా చిన్నదనీ, ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదనీ, నష్టం కూడా వాటిల్లలేదని స్పష్టం చేసింది. తినుబండారాలు, రిఫ్రిజిరేటర్లు మాత్రమే అగ్నిప్రమాదంలో దెబ్బతిన్నాయని పేర్కొంది. మంటలను అదుపు చేయడంలో సహకరించిన శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బందికి ఐసెర్ డైరెక్టర్ భట్టాచార్య కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఐసెర్ లో జరిగిన అగ్ని ప్రమాద దశ్యాలను చిత్రీకరించేందుకు వెళ్లిన విలేకరుల పట్ల అక్కడే ఉన్న సెక్యూరిటీ సూపర్వైజర్ అనుచితంగా ప్రవర్తించారు. పరుష పదజాలం వాడి దూషించారు. అక్కడితో ఆగకుండా ఓ విలేఖరి మొబైల్ ఫోన్ తీసుకొని ఆయనే స్వయంగా ఫోటోలను డిలీట్ చేశారు. దీనిపై పాత్రికేయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అప్పు.. నిప్పై.. మహిళ బలవన్మరణం

చెంచులక్ష్మి గిరిజన కాలనీలో ఘటన

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

సుమలత (ఫైల్‌ఫోటో)

కుటుంబ అవసరాల కోసం పేదలు చేస్తున్న అప్పులు వారి పాలిట యమపాశాలుగా మిగులుతున్నాయి. పేద, బీద, మధ్య తరగతి వర్గాల ఆర్థిక అవసరాలను లక్ష్యంగా చేసుకొని పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీలు పేదలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. 'అమ్మో ఒకటో తారీఖు అనడం కంటే అయ్యో అప్పులెలా కట్టాలి' అంటూ సామాన్యుడు నిత్యం దినదిన గండంగా గడుపుతున్నాడు. నెల పెట్టిందంటే ఒక్కో పేద డ్వాక్రా లోను మొదలు కొని ఇంకో మూడు, నాలుగు మైక్రో ఫైనాన్స్ సంస్థలకు అప్పులు కట్టాల్సి ఉంది. దీంతో ఒక అప్పు కట్టేందుకు ఇంకో అప్పు చేస్తూ పేదలు అప్పుల ఊబిలోకి మరింత నెట్టబడుతున్నాడు. ఆఖరికి తన ఇంటిని కూడా తాకట్టు పెట్టి అప్పులు కట్టేందుకు వెనకాడటం లేదు. అయినా సరే నెలకు కనీసం రూ. 10 వేలు కూడా సంపాదనలేని పేదలు నెల తిరిగేసరికి సుమారు రూ. 30 వేలకు పైగానే అప్పులు కట్టాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కొందరు పేదలు చేసిన అప్పు కట్టలేక.. పదిమందిలో అవమానాలు పడలేక అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్న పరిస్థితి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. అలాంటి ఘటనే పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి పోతే.. పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీకి చెందిన ఈగ సుమలత(40) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. సుమలతకు భర్త రమేష్, ముగ్గురు కుమారులు ఉన్నారు. సుమలత పెద్దల ఇళ్లల్లో పాచి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. భర్త రమేష్ ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. సుమలత ఇంటి అవసరాలకు చేసిన అప్పులో భాగంగా డ్వాక్రా, హాలో ఫైనాన్స్ కంపెనీలకు నెలకు రూ. 30 వేలు కట్టాల్సి ఉంది. అయితే భర్తకు గత ఐదు నెలలుగా పని లేకపోవడంతో ఇంటి వద్ద ఖాళీగా ఉన్నాడు. దీంతో అప్పులు కట్టడం సుమలతకు మరింత భారంగా మారింది. పెద్ద కుమారుడిని పట్టణంలో ఓ దుకాణంలో బాల కార్మికుడిగా పెట్టినా ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడింది. దీంతో సోమవారం తన బాధలను చుట్టుపక్కల వారితో చెప్పుకుని కన్నీటి పర్యంతమైంది. చివరకు మంగళవారం ఇంటిలోనే పురుగుల మందు తాగి తనువు చాలించింది. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టు పూర్తి..!

కెబిఆర్‌నగర్ కాలనీవాసుల్లో సంతృప్తి

నాడు ముంపు ప్రాంతం...నేడు కల్వర్టు నిర్మాణం

సుదీర్ఘ సమస్యకు శాశ్వత పరిష్కారం
నేడు ప్రారంభించనున్న ఎంఎల్ఎ నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సుదీర్ఘ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.. వరద ప్రవాహ ముంపు సమస్య నుండి రక్షించాలని కోరుతూ అనేక పర్యాయాలు ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగిన కేబీఆర్ నగర్ ప్రజలు ప్రస్తుతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణం చేపట్టి బుధవారం చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని ప్రారంభించనున్నారు. దీంతో తాము ముంపు నుంచి బయటపడ్డామన్న ఆనందం ఆ కాలనీవాసుల్లో కనిపిస్తోంది.

గతంలో ఎప్పుడు వర్షం వచ్చినా వరద ముంపుతో కెబిఆర్ నగర్ నీట మునిగేది. దీంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిన తరువాత మళ్లీ వారి ఇళ్లకు చేరేవారు. ఇలా సుదీర్ఘకాలంపాటు ముంపు సమస్యను ఎదుర్కొన్నారు. తమ కాలనీని ముంపు సమస్య నుంచి పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులను కలిసి అనేకమార్లు విన్నవించారు. వైసిపి హయాంలోనూ కల్వర్టు నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేశారు. అయితే ఎన్నికలు రావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ముంపు సందర్భంగా ప్రజాప్రతినిధులు పోటాపోటీగా పర్యటనలు చేసిన సందర్భాలు లేకపోలేదు.

2024 సెప్టెంబర్ 30న.....

గత ఏడాది సెప్టెంబర్ 30న బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబిఆర్ నగర్ నీట మునిగింది. వరద ఉధతి అధికం కావడంతో గతంలో నిర్మించిన పైపులతో కూడిన కల్వర్టు కొట్టుకొని పోయింది. దీంతో కేబిఆర్ నగర్ ప్రజలు కాలనీ నుండి బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపించాలని అక్కడి స్థానికులు ధర్నాకు దిగారు.

20 లక్షల వ్యయంతో....

మంగళం పరిధిలోని లోతట్టు ప్రాంతమైన కేబిఆర్ నగర్ ప్రజలకు మురుగునీటి వరద ప్రవాహం నుండి పరిష్కారం చూపించడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో కల్వర్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. నెలల వ్యవధిలోనే కల్వర్టు నిర్మాణాన్ని గుత్తేదారులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేబీఆర్ నగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించామని స్థానిక టిడిపి నాయకులు గుత్తేదారులలో ఒకరైన గోపీనాథ్ తెలిపారు. బుధవారం ఉదయం నూతనంగా నిర్మించిన కల్వర్టును చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతానని.....

అధికారంలోకి వచ్చిన వెంటనే తాను కల్వర్టు నిర్మాణం చేపట్టి కేబీఆర్ నగర్ ప్రజలకు శాశ్వతంగా మురుగునీటి వరద ప్రవాహ సమస్యను పరిష్కరిస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి అభ్యర్థి పులివర్తి నాని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 30వ తేదీ 2024లో మళ్ళీ అకాల వర్షాలతో కేబీఆర్ నగర్ నీట మునిగింది. అటు తర్వాత అక్టోబర్ 16వ తేదీ ఎమ్మెల్యే హోదాలో కేబీఆర్ నగర్ కు మురుగునీటి వరద ప్రవాహం రావడంతో పర్యటించి వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, గ్రామస్తులు వినియోగించే ప్రధాన మార్గం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి పునరావాస కేంద్రానికి వెళ్లి అక్కడి శరణార్థులను పలకరించి దుప్పట్లు పంపిణీ చేశారు.

తిరుపతి కార్పొరేషన్ పరిధి పెంపు అనివార్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ రాష్ట్ర విభజన అనంతరం పదహారేళ్ల తరువాత పనిచేయడం ప్రారంభించిందని, పియుసి పరిధిలో ఉన్న కంపెనీలకు సంబంధించి వార్షిక నివేదికలను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచాలని పియుసి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహంలో మొట్టమొదటిసారి పియుసి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ మొదటగా ఏపీఎస్పీడీసీఎల్, టీటీడీ, తిరుపతి స్మార్ట్ సిటీ, పర్యాటక శాఖలపై రివ్యూ సమావేశాన్ని నిర్వహించామన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీకి కేటాయించిన గడువు ఈ ఏడాది మార్చి 31న ముగిసిపోయిందని, ఇంకను స్మార్ట్ సిటీ పనుల్లో పురోగతి చెందాల్సి ఉందన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వాటాగా నిధులు విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన రెండు ఆర్థిక సంస్థల నిధులు పెండింగ్లో ఉంచడం వలన తలపెట్టిన పనులు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. వీటిని స్పీకర్ ద్వారా చర్చించి స్మార్ట్ సిటీ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిని పెంచాల్సి ఉందని, లేకుంటే రెవెన్యూ లోటు నమోదు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉందన్నారు. టూరిజం అభివద్ధికి భూముల కేటాయింపులు జరిగినా, టూరిజం అభివద్ధి మరింతగా పెరగాల్సి ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులు ఆనందరావు, ఈశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వర్ల కుమార్ రాజా, వివికే ప్రసాద్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్ రావు, ప్రాజెక్టు డైరెక్టర్ అయుబుఖాన్, టిటిడి ఈవో శ్యామలరావు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు 'భీమినేని' బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పట్నూలు వీధిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా భీమినేని మునికృష్ణనాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి తనకు ఎస్‌టియు పరంగా ఆదిగురువు అని, ఆయన సమక్షంలో ఎస్‌టియు ఆవిర్భవించిన జూన్ 9వ తేదీన బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

గిట్టుబాటు ధర కల్పించే వరకూ పోరాటం

జాతీయ రహదారిపై మామిడి రైతుల ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని, తోతాపురి రకం టన్నుకు రూ.20వేలివ్వాలని డిమాండ్ చేస్తూ పాకాల మండలం దామలచెరువు హైవేరోడ్డులో మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. చిత్తూరు –కర్నూలు జాతీయ రహదారిలో రైతులు అడ్డంగా కూర్చుని 'మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి' అని నినాదాలు చేశారు. కలెక్టర్లు రూ.12వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించినా గుజ్జు పరిశ్రమల యజమానులు ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. టన్నుకు రూ.20వేలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న సమాచారం తెలుసుకున్న పాకాల సిఐ సుదర్శన్ ప్రసాద్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళతామని రైతులకు నచ్చజెప్పారు. రైతుల నిరసనతో జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల పాటు స్తంభించాయి. సిఐ హామీతో 'మన ప్రభుత్వం మంచి ప్రభుత్వమని, మనకు మంచి జరుగుతుంది' అని రైతులు ధర్నా విరమించారు. గిట్టుబాటు ధర కల్పించకుంటే ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు అంచెలంచెలుగా నిర్వహిస్తామని చెప్పారు.



సోమవారం మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నరసింహాచారి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరం పుట్టినప్పటినుంచి ప్రజలకు తాగునీరు అందిస్తున్న మంచినీళ్ల కుంట ప్రస్తుతం కలుషిత నీటితో మురికినీటి కుంటగా తయారయ్యింది. మంచినీళ్ల గుంట తిరుపతి ప్రజలకు, తిరుమలకు వచ్చే యాత్రికులకు దాహార్తి తీర్చేది. తిరుమల కొండపై వర్షాలు పడితే ఆ నీరు తిరుమల కొండల మధ్య నుంచి మంచినీళ్లకుంటకు చేరేది. ఈ నీటిని 1985 వరకు తాగునీటిగా తిరుపతి ప్రజలు ఉపయోగించేవారు. తిరుపతి జనాభా పెరుగుతున్న కొద్దీ కట్టడాలు పెరగడంతో తిరుమల కొండల నుంచి వచ్చే నీరు రావడం ఆగిపోయింది. ప్రస్తుతం తిరుపతిలో వర్షాలుపడితేనే మంచినీళ్లకుంట నిండుతుంది. వర్షాకాలంలో ఈ కుంట నిండిపోతే ఇందులో ఉండే చేపలు పుష్కలంగా ఉండేవి. ఎక్కడో రామాపురం నుంచి తెలుగుగంగ నీటిని పంపింగ్ చేసుకోడానికి, కల్యాణి డ్యాం నిండితే తాగునీరు అందించడానికి శ్రద్ధ చూపిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, స్వతహాగా సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీళ్లగుంటను అభివృద్ధి చేసేందుకు ఎందుకు ఆసక్తి చూపడం లేదన్నది కార్పొరేటర్ నరసింహాచారి ఆవేదన మాత్రమే కాదు. నగరవాసుల అందరి ఆవేదన.

కల్యాణి డ్యాం ప్రాజెక్టు నీటిని తిరుపతి ప్రజలకు తాగునీరుగా అందించడంతో క్రమేపీ మంచినీళ్లగుంట నీటిని తాగేవారి సంఖ్య తగ్గింది. ప్రస్తుతం తెలుగుగంగ నీటినీ నగర వాసులు వాడుకుంటున్నారు. కల్యాణిడ్యాం, తెలుగుగంగ నీరు పుష్కలంగా ఇళ్లల్లో వాడుకోడానికి నగర వాసులకు అందుతుండటం, మినరల్ వాటర్ తాగేందుకు వినియోగిస్తుండడంతో క్రమేపీ మంచినీళ్లగుంట ప్రాచుర్యం తగ్గిపోయింది. కొండల నుంచి వచ్చే నీరు కావడంతో ఔషద గుణం ఉండేదని, మంచినీళ్లగుంటలో నీరు తాగితే రోగాలు వచ్చేవి కావన్న నమ్మకం నగరవాసుల్లో ఒకప్పుడు ఉండేది. మంచినీళ్లగుంట పరిసర ప్రాంతాల్లో ఐదు డివిజన్లు ఉన్నాయి. దాదాపు 75వేల మంది నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు రెండూ భూగర్భంలోనే ఉండడంతో పైపులు పగిలిన ప్రతిసారీ కలుషిత నీరే ఇళ్లల్లోని 'సంపుల్లోకి' వచ్చి చేరుతుంది. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ దశాబ్దాల నాటిది కావడంతో పైపులు పగిలి, బోరు నీళ్లు సైతం కలుషితమయ్యే పరిస్థితి. మంచినీళ్లగుంటను బాగు చేయాలని అప్పటి కౌన్సిలర్ నరసింహాచారి మున్సిపల్ చైర్మన్ కందాటి శంకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు కోటి రూపాయలతో మున్సిపాలిటీ ఆధునీకరణ పనులు చేపట్టింది. కౌన్సిల్ దిగిపోయిన తరువాత అటు మున్సిపల్ కార్పొరేషన్ గానీ, ఇటు టిటిడి గానీ పట్టించుకోలేదు. 2007 నుంచి 2022 వరకూ కౌన్సిల్ లేకుండా పోవడంతో మంచినీళ్లగుంట మురికిగుంటగానే మిగిలిపోయింది. 2023లో కౌన్సిల్ ఏర్పడింది. కార్పొరేటర్‌గా నరసింహాచారి మరోసారి మంచినీళ్లగుంట అభివృద్ధిపై కౌన్సిల్లో పలుమార్లు నిలదీశారు. అధికారులు సైతం పరిశీలించారు తప్ప ఎటువంటి ప్రణాళిక రూపొందించలేదు. మంచినీళ్లగుంట పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ బోర్లలోనూ డ్రైనేజీ నీరు పొంగి ప్రవహిస్తోందని కార్పొరేటర్ నరసింహాచారి గత మూడేళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. వర్షాకాలంలో మురికిగుంట నుంచి దుర్గంధం వెదజల్లే పరిస్థితి. ఒకప్పుడు అందరికీ తాగునీటిని అందించిన మంచినీళ్లగుంట దుర్గంధం వెదజల్లుతూ ఉంటే కార్పొరేషన్‌కు చీమకుట్టినట్లు లేదన్నది నరసింహాచారి ఆవేదన. వైసిపి హయాంలోనూ కార్పొరేటర్ నరసింహాచారి పోరాటం చేసినా అంతంతమాత్రంగానే అధికారులు స్పందించారు. ప్రస్తుతం కూటమి హయాంలోనూ తాజాగా సోమవారం తిరుపతికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి మంచినీళ్లగుంట సమస్యను తీసుకెళ్లారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పందించి మంచినీళ్లగుంట సందర్శించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కనీసం 'కూటమి' హయాంలోనైనా నరసింహాచారి పోరాటం సఫలీకృతం అవుతుందేమో వేచి చూడాల్సిందే.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి

జీవోఎంఎస్ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లిచెంగయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్‌కార్మికులకు వేతనాలు పెంచేవరకూ పోరాటం ఆగదన్నారు. గతంలో 17 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75వేలు చెల్లించాలన్నారు. 10 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు ఉంటే ఒక్కో ఏడాదికి అదనంగా 2వేల రూపాయలు చొప్పున చెల్లిస్తామని చెప్పిన హామీ ప్రకారం చెల్లించాలని అన్నారు. ఎక్స్‌గ్రేషియో 5 లక్షల నుండి ఏడు లక్షల రూపాయలు ఇచ్చిన హామీ ప్రకారం పెంపుదల చేయాలని అన్నారు. దహన సంస్కారాలకు 15000 నుండి 20వేలకు పెంపుదల చేస్తామని చెప్పిన ఒప్పందం ప్రకారం జీవోలు జారీ చేయాలని అన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. ప్రత్యేకంగా జీవో జారీ చేయాలని అన్నారు. 12వ పిఆర్సి సి వెంటనే ప్రకటించాలని అన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే, మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుద్ధ్య కార్మికుల అందరిని పర్మినెంట్ చేయాలని అన్నారు. సమ్మె నోటీసు ఇచ్చి 15 రోజులైనా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు.ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ వల్లూరు పెంచలయ్య, కార్యదర్శి ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పి రమణ య్య , గోపాల్ , హరిబాబు, అధ్యక్ష ,కార్యదర్శులు వెంకటసుబ్బయ్య , నరసింహులు, ధనలక్ష్మి, ధనంజయ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ సిపిఎం కార్యాలయంలో కేఆర్ సుబ్రమణ్యం పిళ్ళై అధ్యక్షతన పార్టీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక పెన్షన్ అమలు తప్ప మరే ఇతర హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోపాలకృష్ణాపురం సర్వేనెంబర్ 35/ 2 భూమి, 40 సంవత్సరాలుగా ఎస్టీల అనుభవం లోఉందని, ఈ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు. జూలైలో 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మిక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ వెంకటేష్, నాయకులు ఏ విజయ్, రమేష్, యాసీన్ భాష, దేవా రెడ్డి, ముని శంకర్, శివ, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టాటా ఆల్ట్రోజ్

కొత్త మోడల్ కారును విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టాటా మోటార్స్ ఆధ్వర్యంలో రూపొందించిన సరి కొత్త ఆల్ట్రోజ్ వెహికల్‌ని తిరుపతి ఆర్టీవో మురళీ మోహన్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కాటన్ మిల్ వద్ద విజయ భారతి టాటా మోటార్స్ రెండవ బ్రాంచ్‌ను ప్రారంభించారు. బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనం పెట్రోల్, డీజిల్, సిఎన్జి, మూడు ఇంజిన్లతో, ఏఎంటీ, డిసిఎ, ఎం.పి ట్రాన్స్మిషన్లు అందుబాటులో ఉందన్నారు. స్మార్ట్, ప్యూర్, క్రెటివ్, ఆకాంప్లీస్‌తో ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో కారు రూపొందించబడిందన్నారు. ఇండియన్ కార్ మార్కెట్‌లో హ్యాచ్ బ్యాక్ డీజల్‌తో ఆల్ట్రోజ్ మాత్రమే అందుబాటులో ఉందన్నారు. స్టైలిష్ లుక్, పవర్, టెక్నాలజీ గల ఆల్ట్రోజ్ ఫైవ్ స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో అత్యుత్తమ కారుగా నిలిచిందన్నారు. ఈ కారులో ఆరు ఎయిర్ బ్యాగులు, ఆస్ స్టాండర్డ్, హార్మాన్ ద్వారా 26.06 హెచ్‌డి ఇన్ఫోటైన్మెంట్ వంటి అత్యాధునిక ఫీచర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కారు ప్రధమిక ధర రూ.6.89 లక్షల నుండి అందుబాటులో ఉందన్నారు. వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యండి వెంకటరామ్ సభాపతి, జోనల్ హెడ్ జయదీప్, రీజినల్ మేనేజర్ గోపికృష్ణ, కెరటజీ మేనేజర్ గౌతమి, ఆ సమస్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు సహకరించండి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) మండలంలోని ఐతేపల్లి – రంగంపేట రోడ్డు అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఐతే పల్లి నుంచి రంగంపేట వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను ఎమ్మెల్యే నాని మంగళవారం నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు విస్తరణలో తాము నష్టపోతున్నామని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 30 సంవత్సరాల తర్వాత జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. రోడ్డు విస్తరణ చేస్తే ఊరు, పంచాయతీ బాగుపడుతుందని చెప్పారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుజిరిలను వేధించడం తగదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గుజిరిలను పోలీసులు వేదించడం సరైనది కాదని ఏఐయుటిసి నగర కార్యదర్శి ఎన్‌డి రవి పేర్కొన్నారు. తిరుపతి, గంధమనేని శివయ్య భవన్లో గుజిరి వ్యాపారుల సంఘం (ఏఐటీయుసి అనుభందం) పట్టణ రెండవ మహాసభ మంగళవారం దాము అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుజరీలకు స్థలాలు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. గుజిరి వ్యాపారుల సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబక్షు మాట్లాడుతూ 20 న తిరుపతిలో జరిగే జిల్లా మొదటి మహాసభకు జిల్లా వ్యాప్త గుజిరి వ్యాపారులు హాజరై సమస్యలపై పోరాటాలకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఏఐటీయుసి నాయకులు శివ, రాజా, పురుషోత్తం, మహేంద్రా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ పన్నెం జీవమ్మకు నివాళి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: స్థానిక బస్టాండు వద్ద మాజీ ఎంపీపీ దివంగత పన్నెం జీవమ్మ వర్థంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, టీడీపీ నేతలు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హీరో బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తిరుమల: సినీ హీరో నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినం తిరుమల, అఖిలాండం వద్ద ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్ వర్మ నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ బస్టాండ్ ప్రాంగణంలో భారీ కేక్ కట్ చేసి నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు, టడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సంజయ్ గాంధీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. నందమూరి బాలకృష్ణ ప్యాన్స్ విద్యాసామాగ్రిని ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

సత్యవేడు నియోజకవర్గంలోని మండలాల్లో పర్యటిస్తున్న జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు విన్నవించారు. మంగళవారం ఆయన జేసి శుభం బన్సల్‌తో కలిసి నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి ప్రజల సమస్యలతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణవనంలో తహశీల్దారు కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు, తుడా నిధులతో ఎకో పార్క్ నిర్మాణం, భీముని చెరువు, కశిమిట్ట తో పాటు అర్హులైన లబ్ధిదారులకు పొసెషన్ సర్టిఫికెట్, అరణ్యం కండ్రిగలో సి.జె.ఎఫ్.ఎస్ భూములు పంపిణీ, కైలాసనాథ కోనలో పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జేసీని కోరారు. అనంతరం వారు అరణీయార్ వద్ద నిర్మాణంలో ఉన్న వ్యూ టవర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వ్యూ టవర్, చిల్డ్రన్స్ పార్కు, ఇతర పర్యాటక అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు విడుదల చేయాలని, ఎస్.ఎస్.బి పేటలో ఉన్న 200 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్థానిక పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ, మిగిలిన గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు, నీరువాయి పరిధిలో ఉన్న సి.జె.ఎఫ్.ఎస్ భూములు పంపిణీ, కీలపూడికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని జేసీ శుభం బన్సల్‌ను ఎమ్మెల్యే కోరారు. అనంతరం నాగలాపురంలి మండలం, సురుటపల్లి వద్దకు చేరుకున్న జేసీ, ఎమ్మెల్యే దాసుకుప్పం బైపాస్ రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.26 కోట్లు నిధులకు ఫైనాన్స్ క్లియరెన్స్‌కు సిఫార్సు చేయాలని, పేదలకు ఇంటి పట్టాలు, నాగలాపురం బస్టాండ్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు విడుదల చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకొని పాడుబడ్డ భవనాన్ని పరిశీలించారు. కళాశాలకు నూతన భవనం నిర్మించేంతవరకు సదలమ్మ గుడి వద్ద ఉన్న శాప్ భవనంలోకి మార్చాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే వా నెల్లూరు లోని ఎం.ఐ.జి లే అవుట్ భూములను తుడా నిధులతో ల్యాండ్ అక్విజిషన్ చేసి తక్కువ ధరకు ప్లాట్లు అందించాలని, పెరడం, మదనంబేడు, అంబాక్కం, వా నెల్లూరు, ఇరుగులంలోని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. చివరిగా వరదయ్యపాలెం తహశీల్దారు కార్యాలయానికి చేరుకొని మండలంలోని రాచకండ్రిగ వద్ద రూ.40 లక్షలు తుడా నిధులతో డ్రైనేజీ నిర్మించాలని, మండలంలోని ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ, గోవర్ధనపురం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పాడుబడ్డ తెలుగు గంగ ప్రాజెక్టు భవనాన్ని కూల్చి వేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ డి.ఇలంగోవన్, పద్దు రాజు, ఆయకట్టు, చైర్మన్ రవి, ఢిల్లీ బాబు, తాసిల్దార్ టీ వీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాలు, డ్రోన్లు పంపిణీ

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) రైతన్నలు డ్రోన్ల సహాయంతో సులభతరమైన వ్యవసాయాన్ని లాభసాటిగా చేయ వచ్చని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి మండలం నారావారి పల్లిలో రెండవ విడతలో రైతులకు సబ్సిడీ ద్వారా వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన మంగళవారం శ్రీకారం చుట్టారు. దీనితో పాటుగా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడానికి సబ్సిడీ ద్వారా రైతు సంఘాలకు డ్రోన్లను ఎమ్మెల్యే పులివర్తి నాని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రాయితీలతో నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. చంద్రగిరి మండలానికి 502 క్వింటాల్ వేరుశనగ విత్తనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. క్వింటాల్ వేరుశనగ విత్తనాలు ధర 9600 రూపాయలని, అందులో ప్రభుత్వం సబ్సిడీ 3840 రూపాయలు పోను, రైతులు 5760 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. చంద్రగిరి మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు15 రకాల వ్యవసాయ పనిముట్లు మంజూరు చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి పార్టీల నాయకులు,మహిళలు,యువత,రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నాయుడుపేట: నిరుద్యోగాన్ని రూపుమాపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం నాయుడుపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో మేనకూరు, మాంబట్టు, శ్రీ సిటీ సెజ్‌లలోని పరిశ్రమల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర 2047 విజన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజక వర్గ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు సుధీర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోస్టర్లు

ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏపీ ప్రోచైల్డ్ గ్రూప్, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం సహకారంతో బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోస్టర్లను ఏర్పేడు పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్స్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో, తిరిగి బడిలో చేర్చడంలో, డ్రాపోట్లు, బాల్య వివాహాల విషయంలో ప్రగతి సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదన్నారు. జూన్ 12న అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రగతి సంస్థ పని చేస్తున్న అన్ని మండలాల్లో పోస్టర్లను ఆవిష్కరించడం జరుగుతున్నదని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది మురగయ్య, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రేణిగుంట: ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట మండల విద్యాధికారి ఇందిరా దేవి చేతుల మీదుగా బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట ఎం.ఈ. ఓ. మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో గాని, వారిని తిరిగి బడిలో జరిపించడంలో గాని, డ్రాపోట్లు, బాల్య వివాహాల విషయంలో ప్రగతి సంస్థ రేణిగుంట మండలంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమైనన్నారు. ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.నారాయణ మాట్లాడుతూ బాలల భవిష్యత్తులోనే దేశ భవిష్యత్తు దాగి ఉంటుందన్నారు. జూన్ 12వ తారీఖున అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రగతి పని చేస్తున్న అన్ని మండలాల్లో ఈ పోస్టర్లను ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్లు జయలక్ష్మి, శిరీష, సుభాష్ చంద్రయ్య, సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీవారి భక్తులకు సేవలు అందిస్తున్న టిటిడి ఉద్యోగుల సమస్యలను నిర్దేశించన సమయంలో పరిష్కరించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టిటిడిలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, టిటిడి పరిధిలోని ఉద్యోగుల సమస్యలను నిర్దేశించిన సమయంలోను, ప్రభుత్వ పరిధిలోని అంశాలపై వారితో చర్చించి అనుమతులు తీసుకుని పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ఫండ్ కేటాయింపులోను, ఇతర అలవెన్స్‌ల చెల్లింపులోను అలసత్వం లేకుండా పరిష్కరించాలని కోరారు. నిబంధనల ప్రకారం పదోన్నతులు, బదిలీలు, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. జీఎన్బీ, ఎస్వీ పూర్ హోమ్, కే.టీ, వినాయకనగర్, రామనగర్ ప్రాంతాలలోని టిటిడి క్వార్టర్స్ లలో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతులు విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ వేసుకుని పరిష్కరించాలని సూచించారు. సదరు ప్రాంతాలలో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజనీరింగ్, మౌళిక సదుపాయాలపై టిటిడి ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. దిగువ స్థాయిలో ఉద్యోగుల సమస్యలపై నిరంతరం సీనియర్ అధికారులు చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వ స్థాయిలో సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సిఈ టివి సత్యనారాయణ, డిఎల్వో వరప్రసాద్ రావు పాల్గొన్నారు.

విశాఖ స్టీలుప్లాంట్ కార్మికులకు మద్దతుగా ధర్నా

ప్రజాశక్తి - రేణిగుంట : విశాఖ స్టీల్ ప్లాంట్ సంస్థను ప్రైవేట్ వారికి కట్టబెట్టాలని, కార్పొరేట్ల ప్రయోజనం కోసం ప్రధాని మోడీ మెప్పు కోసం ఉద్దేశపూర్వకంగానే విశాఖ స్టీల్ ఉక్కు కర్మాగారంలో 5400 మంది కాంటాక్ట్ కార్మికులు పని చేస్తుండగా హఠాత్తుగా 3వేల మంది కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు కె.సెల్వరాజ్, కె.హరినాథ్, సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ స్టీలు ప్లాంట్‌నందు తొలగించిన మూడువేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. దిలీప్‌బాష, దీప, కుప్పస్వామి, కృష్ణ, చీరాలయ్య, దస్తగిరి, ఈశ్వరమ్మ, భారతి, పద్మ పాల్గొన్నారు.

పద్మావతినగర్ లేఔట్ పరిశీలించిన తుడా చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడానికి తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ అనుకూలమైన ధరలతో పద్మావతినగర్ లేఔట్ తుడా ఫ్లాట్స్ ను విక్రయిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కోరారు. రేణిగుంట మండలం సూరప్పకశంలోని పద్మావతి నగర్ తుడా లేఔట్‌ను మంగళవారం తుడా అధికారులతో కలిసి పరిశీలించారు. లేఅవుట్ ప్లానింగ్‌ను అధికారులు తుడా చైర్మన్‌కు వివరించారు. కమర్షియల్‌కు, రెసిడెన్షియల్‌కు కేటాయించిన ప్లాట్స్ ను మ్యాపింగ్ ద్వారా అధికారులు వివరించారు. జంగిల్ క్లియరెన్స్ చేసి వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పించి వేలానికి వెళ్లాలని తుడా చైర్మన్ అధికారులకు సూచించారు.. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సూరప్పకశం పద్మావతి నగర్ తుడా లేఔట్ లో ఇంకా 270 ఫ్లాట్లు అమ్మకానికి ఉన్నాయని తెలియజేశారు. పేద మధ్య తరగతి ప్రజలను దష్టిలో ఉంచుకొని అనువైన ధరకు ఫ్లాట్లను విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడ సెక్రటరీ శ్రీకాంత్, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ సుజన, సూపర్డెంట్ ఇంజనీర్ కష్ణారెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి, జాయింట్ ప్లానింగ్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్రయ్య, డివిజనల్ ఇంజనీర్ నరేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు సాధనకు సన్నద్ధం కండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సంక్షేమ బోర్డు సాధనకు సన్నద్ధం కావాలని, పోరాటాలకు పదును పెట్టాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎండి రవి పిలుపునిచ్చారు. శ్రీ బాలాజీ లారీలోడింగ్, అన్లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ తిరుపతి నగర సమితి సమావేశం స్థానిక బైరాగి పట్టేడ, ఏఐటియుసి నగర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీడేట్లు పెరగాలని అందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ వారు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, నగర నాయకులు సారథి, సెండిల్, మోహన, రాజేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

ప్రజాశక్తి -ఏర్పేడు : కందాడుకు చెందిన గెడ్డం మనోహరమ్మ తమ పొలంలో అదే గ్రామానికి చెందిన భార్య, భర్తలు కత్తులతో తిరుగుతూ, కులం పేరుతో దూషిస్తూ తమను పొలం వద్దకు రానివ్వకుండా చేస్తున్నారని ఏర్పేడు పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు ఏర్పేడు మండలం, కందాడు దళితవాడకు చెందిన తమకు అదే గ్రామానికి చెందిన పోలూరు వెంకటేశ్వర్ల రెడ్డితో గత కొన్ని సంవత్సరాలగా భూ వివాదాలున్నాయన్నారు. 2021లో ఏర్పేడు తహశీల్దార్, పోలీసుల సమక్షంలో ఈ భూమి హక్కుదారలమైన మాకు పత్రాలను అందజేశారని తెలిపారు. అప్పటినుండి ఆ భూమిలో పంట వేసుకుంటున్నామని, కానీ 4 రోజులుగా పోలూరు వెంకటేశ్వర్ల రెడ్డి అతని భార్య గురవమ్మ ఇరువురు మా భూమిలో కత్తులతో తిరుగుతూ, మమ్మల్ని కులం పేరుతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశామని తెలిపారు.

PUBLIC NOTICE

My client **K.Anuradha W/o Hari Prasad, resident at D.no.4-127,Bazaar Street, Puttur town and Mandal, Tirupati District,** vender purchased by the M.Ravi Chandra S/o M.Ramakrishna Raju of the schedule mentioned property in Sy.No.269/ B, an extent of AC.4.41 cents by way of registered sale deed dt.30-07-2003 under Doc. No. 1318 of 2003 at Puttur SRO from J.Govinda rajulu and 2 others was lost the above document during the transit for Xerox copies on 25-04-2025 and my client gave police complaint on the same day and not traced the above document, if anybody finds in the above original document, please hand over the same to my client or to me and we will give some award within 10 days.

Schedule:
Chittoor District,now Tirupati District, Sri Balaji Registration District, puttur sub- district, Puttur Mandal, No.28.Taduku Village accounts Sy,No.269 B toal extent A.C.4.41 cents or Hectors 1.783 land area.

G.MADHUSUDHANA REDDY
Advocate, D.No.18-4-75, Railway colony, Tirupati-517501. Cell: 9440934263, 9059570525

మహారాజశ్రీ శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
I.A.NO. 3/2023
O.S.NO. 25/2023
సురకాని వరదరాజులు వగైరా ...పిటిషనర్స్
మరియు
పులుసు రవి వగైరా ...రెస్పాండెంట్స్
TO:
ఇనుకల శంకర్, తండ్రి సుబ్బరాజు, శివగిరిపల్లి గ్రామం, మద్దిలేడు పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
నోటీసు
ఇందుమూలముగా పై పిటిషన్ నందు రెండవ రెస్పాండెంట్ అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై పిటిషన్ నందు నీ హాజరు కోరుతూ I.A.NO. 3/2023 వాయిదా 20.06.2025న కలదు. కావున నీవుగాని, నీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 20.06.2025 ఉదయం 10:30గం॥లకు పై కోర్టునందు హాజరై ఏదైని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షములో నీ పరోక్షమున పిటిషన్‌ను తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు
సి.వెంకటస్వామి
న్యాయవాది, శ్రీకాళహస్తి

మహారాజశ్రీ శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
I.A.NO. 2/2023
O.S.NO. 25/2023
సురకాని వరదరాజులు వగైరా ...పిటిషనర్స్
మరియు
పులుసు రవి వగైరా ...రెస్పాండెంట్స్
TO:
ఇనుకల శంకర్, తండ్రి సుబ్బరాజు, శివగిరిపల్లి గ్రామం, మద్దిలేడు పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
నోటీసు
ఇందుమూలముగా పై పిటిషన్ నందు రెండవ రెస్పాండెంట్ అయిన నీకు తెలియజేయడం ఏమనగా పై పిటిషన్ నందు నీ హాజరు కోరుతూ I.A.NO. 2/2023 వాయిదా 20.06.2025న కలదు. కావున నీవుగాని, నీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 20.06.2025 ఉదయం 10:30గం॥లకు పై కోర్టునందు హాజరై ఏదైని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షములో నీ పరోక్షమున పిటిషన్‌ను తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు
సి.వెంకటస్వామి
న్యాయవాది, శ్రీకాళహస్తి

క్రైం న్యూస్

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

సంఘటనను పోలీసుకు వివరిస్తున్న బాధితురాలు భారతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళంపల్లి, చెన్నాయి గుంట సమీపంలోని మంచి నీళ్ల కుంట వద్ద మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో మూడు లక్షల రూపాయలు విలువ చేసే బంగారు గొలుసును బైక్‌లో వచ్చిన అగంతకులు లాక్కుని పోయారు. బాధితురాలు భారతి తెలిపిన వివరాల మేరకు చాలా రోజుల నుండి గ్రామానికి చెందిన మహిళలు 6 మంది వాకింగ్‌కు ఎరుకులబాట వైపు వెళ్తుంటామని తెలిపారు. అయితే మంగళవారం ఇద్దరం మాత్రమే వాకింగ్‌కు వెళ్లామని, వెనుక నుండి ముగ్గురు యువకులు రెడ్ కలర్ పల్సర్ బైక్ పై మమల్ని పక్కన ఒక్కసారిగా బండి ఆపి తన మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసును లాక్కుని వెళ్ళిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేకలు పెట్టినా చుట్టుపక్కల ఎవ్వరూ లేకపోవడంతో వారు పరారయ్యారన్నారు. దీనిపై తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ వలలో విశ్రాంత ఉపాధ్యాయుడు

రూ. 1కోటి 20 లక్షల 80వేలు లూటీ చేసిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సైబర్ నేరగాళ్ల వలకు ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు బలయ్యాడు. అతని అకౌంట్ నుంచి కోటి 20 లక్షల80 వేల రూపాయలు సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు తిరుపతి, నవోదయ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడుకు ఇటీవల సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. ఢిల్లీ కెనరా బ్యాంకులోని మీ అకౌంట్‌తో సదాకత్ ఖాన్ అనే వ్యక్తి ఉపయోగించి, మానవ అక్రమ రవాణాకు జరుగుతుందని తెలిపారు. నేను సిబిఐ అధికారినంటూ వాట్సప్ కాల్ చేశాడు. మీ ఖాతాల వివరాలను తెలపండి, లేదంటే మీపై ఎన్ఐఏ, ఈడి, సిఐడి, ఎన్ సిటి అధికారులకు చెబుతానంటూ బెదిరించారు. అకౌంట్ వివరాలు బాధితుడు చెప్పడంతో 6సార్లు ట్రాన్సాక్షన్స్ జరిపి 1కోటి 20 లక్షల 80 వేలు రూపాయలు కాజేశాడు. మోసపోయానని తెలుసుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడు 1930 ద్వారా సైబర్ డెస్క్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు అలిపిరి పోలీసులను సంప్రదించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆపి ఉన్న మోటారు బైకులను, ఒంటరిగా వెళ్లే మహిళల మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్ళే ఇద్దరు దొంగలను మంగళవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరా లను స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ నాగార్జున రెడ్డి మీడియాకు వివరించారు. ఇటీవల కాలంలో శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాల్లో వరుస బైకులు, బంగారు గొలుసుల దొంగతనాలు జరిగాయి. ఈ నేపథ్యంలో దొంగల కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్న టూ టౌన్ పోలీసులకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారు పారిపోయే ప్రయత్నం చేయడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. విచారణలో వీరు బైకులు, మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగలించినట్లుగా ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తులు తిరుపతి ఎంఆర్ పల్లికి చెందిన షేక్ అల్తాఫ్(19), శ్రీకాళహస్తి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ (20)లుగా గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసైన వీరిద్దరూ ఆపి ఉన్న బైకులు, ఒంటరిగా రోడ్లపై వెళ్లే మహిళల మెడలో బంగారు గొలుసులు కొట్టేసి, వాటిని చౌకగా అమ్మేసి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం అలవాటు చేసుకున్నారని సీఐ తెలిపారు. టూ టౌన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో వీరు నిందితులుగా ఉన్నారనీ, సొమ్ము రికవరీకి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం శ్రీకాళహస్తి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వైభవంగా ఆరేటమ్మ జాతర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు గ్రామ దేవత ఆరేటమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అంబిల్లు పోసి, పొంగళ్ళు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు చెంచయ్య అధ్యక్షత వహించారు. ఈ ఉత్సవంలో పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, ఈశ్వర్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, కుప్పయ్య, భారతి, రవి ఆరేటమ్మ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో భూ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కోట: రైతుల భూముల సర్వేను డ్రోన్‌ల సాయంతో పరిష్కరిస్తామని తహసీల్దార్ కటారి జయ జయ రావు తెలిపారు. మంగళవారం కోట మండలం, కర్లపూడిలో పలు భూముల సర్వేను డ్రోన్లతో నిర్వహించారు. ఈ సర్వేలను కర్లపూడి, సిద్దవరం, కొత్తపట్నం గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ శ్రీనివాసులు, డ్రోన్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, SRIKALAHASTI
O. S. NO. 03/2020
M. Sudhakar Naidu ...**Plaintiff**
Vs
G. Jayachandra Naidu ...**Defendant**
1. Take notice that the above case stands posted to 16-06-2025 at 10:30 am in the court of Hon'ble Senior Civil Judge, Srikalahasti for the appearance of the Defendant herein to answer the claim of the Plaintiff.
2. The Hon'ble Court had directed the Defendant to appear on 16-06-2025 at 10:30 am in the court of Hon'ble Senior Civil Judge, Srikalahasti Srikalahasti and file your objection if any for the claim of the plaintiff.
3. If the Defendant fails to attend the court on 16-06-2025 at 10:30 am, the matter will be decided exparte and the court will proceed with the matter accordingly.
C. HEMANTH KUMAR, B.Com., LLB.,
C.DINESH KUMAR, B.A., LLB.,
Advocates

ముత్యపు కవచంలో మురిపించిన శ్రీ మలయప్ప

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చిరు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు మరియు వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీ మలయప్ప స్వామివారికి, దేవేరులకు అభిదేయక అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీ మలయప్పస్వామివారికి ముత్యపు కవచ సమర్పణ వేడుకగా జరిగింది. అనంతరం సహస్రదీపాలంకార సేవలో స్వామి ముత్యపు కవచంలో భక్తులను అనుగ్రహించారు. సంవత్సరంలో ఒకమారు మాత్రమే ముత్యపు కవచాన్ని ధరించిన స్వామివారి ముగ్ధమనోహర రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై కల్యాణ వెంకన్న

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అభయహస్తం అలంకారంలో శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి వారు సర్వభూపాల వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 9.30 - 11 గం.ల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 04.00 - 4.30 గంటల మధ్య కళ్యాణ మండపానికి శ్రీవారు వేంచేపు చేశారు. సాయంత్రం 4.30 - 6.30 గంటల మధ్య శ్రీవారి ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో స్వామి వారు భక్తులనుఆశీర్వదించనున్నారు. శుక్రవారం రాత్రి 7.30 గంటలకు గరుడ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులను అనుగ్రహించనున్నారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

మోహిని అవతారంలోశ్రీ వెంకటేశ్వరస్వామి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, రాజా వీధి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారు మోహిని అలంకారంలో మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెప్పపై విహరించిన పద్మావతీ అమ్మవారు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు మంగళవారం పద్మ సరోవరంలో శ్రీ పద్మావతీ అమ్మవారు తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, నిర్వహించారు. మధ్యాహ్నం 03.00 నుండి 4.30 గంటల వరకు స్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్ద వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ పద్మావతీ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో గజ వాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ఇతర ఆధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

జోగల కాలనీలో వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి పాత పేట, జోగల కాలనీలో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వర్ణముఖి నదిలో మట్టిని తీసుకొచ్చి గంగమ్మ ప్రతిమను తయారు చేశారు. పసుపు, కుంకుమలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఉంచి పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫనబాకం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని వేలాడుతున్న మృతదేహాలు చూసి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సుబ్బరామిరెడ్డి, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు బ్లూ సఫారీ షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు.

చర్మ వ్యాధుల నిపుణులు రాక

ప్రజాశక్తి -కోట : ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రీతి రెడ్డి ప్రతినెలా రెండవ బుధవారం కోట ఎన్‌సిఆర్ నగర్‌లోని జనతా క్లినిక్‌కు వస్తారని డాక్టర్ ఎమ్.జగదీష్, డాక్టర్ ఉమేరాలు తెలిపారు. 11 వ తేది బుధవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు అందుబాటులో ఉంటారన్నారు. అపాయింట్మెంట్ కొరకు 96424 14572, 9738577366 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-ఏర్పేడు: యండి పుత్తూరులో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం-వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా పన్నెండవ సెషన్ క్రింద మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిడిపిఓ కృష్ణవేణి పాల్గొని, బాల్య వివాహాల వలన జరుగు నష్టాల గురించి తెలియజేశారు. సర్పంచ్ మోహనప్రియ మాట్లాడుతూ గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరవైజర్ భారతి, ప్రగతి సంస్థ సూపర్ వైజర్ సుమలత, పంచాయితీ కార్యదర్శి భువనేశ్వరి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నడి వీధి గంగమ్మకు ఎమ్మెల్యే సారె

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎస్టీవి నగర్ నడివీధి గంగమ్మకు మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సారె సమర్పించారు. 19వ డివిజన్ పరిధి, శేషాద్రినగర్ నడివీధి గంగమ్మ ఆలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు రాజా రెడ్డి, శ్రీహరి నాయుడు, బలరాం రాయల్, బన్నీరాజు, సురేష్, సురేఖ, యశోదా, జశ్వంత్, రవి, శ్రావణ్, ప్రభాకర్, ప్రదీప్, ఓం ప్రకాష్, మధు, కళావతి, రంగారెడ్డి, మౌళి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుని ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా స్వర్గీయ శోభన్ బాబు అల్లుడు డాక్టర్ శరత్, మృదుల, సురక్షిత్, శ్రీలత, సాన్విక్ష, సమన్వి, తదితరులు వ్యవహరించారు.